క్లుప్తంగా

టెట్ ఫీజు తగ్గించండి

జూలూరుపాడు: టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... టెట్ ఫీజును రూ.2000 నుంచి రూ.200కు తగ్గించి నిరుద్యోగులకు ఉపశమనం కలిగించాలన్నారు. టెట్ దరఖాస్తు ఫీజు పెంచడంతో పేద, మధ్యతరగతి అభ్యర్థులకు భారంగా మారిందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫీజు తగ్గించాలని పేర్కొన్నారు.

జడ్జిని కలిసిన బార్ కమిటీ


న్యాయమూర్తి వసంత్ పాటిల్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు బార్ నూతన అసోసియేషన్ అధ్యక్షుడు భుక్యా రవికుమార్ నాయక్ మంగళవారం జిల్లా జడ్జి వసంత్ పాటిల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ఎన్నికలు జరిగి తన ప్యానెల్ విజయం సాధించిన సందర్భంగా జడ్జిని కలిశారు. అసోసియేషన్ సభ్యులు ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, నవీన్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలల్లో ప్యానల్ తనిఖీ రద్దు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల విధుల ట్రైనింగ్, ఎస్సెస్సీ మూల్యాంకన డ్యూటీ, ఈనెల 8 నుంచి జరగనున్న ఎస్‌ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయుట, తదితర కారణాల రీత్యా గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్యానల్ తనిఖీ రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, రవి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023-24 విద్యా సంవత్సరం ముగింపుకు కేవలం 13 పనిదినాలు మాత్రమే ఉన్నాయని, అందులో 8 పనిదినాలలో ఎస్‌ఏ-2 పరీక్షలు ఉన్నట్లు తెలిపారు.

పన్నులు చెల్లించండి

ఇల్లెందు: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు, నల్లా పన్నులు చెల్లించాల్సిన వారు ఈ నెలాఖరు నాటికి చెల్లించేందుకు అవకాశం ఉందని కమిషనర్ యాదగిరి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించిందన్నారు. ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముస్లింలకు కానుకలు పంపిణీ

ఇల్లెందురూరల్: ముస్లిం కుటుంబాలకు మత పెద్దలు మంగళవారం దుస్తులు, వంట సామగ్రి పంపిణీ చేశారు. బొజ్జాయిగూడెం సమీపంలోని మదర్సాలో మంగళవారం ఏర్పాటైన సమావేశంలో మతపెద్ద ఇనాయితుల్లీ రషీది మాట్లాడుతూ.. ప్రతి ముస్లిం కుటుంబం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షతో పేదలకు చేయూతనందిస్తున్నామని చెప్పారు. ఈ మాసంలో ముస్లిం కుటుంబాలలో ధనవంతులు తమ ఆదాయంలో కొంత భాగాన్ని పేదలకు పంపిణీ చేస్తారని చెప్పారు. ఇందులో భాగంగా సమీకరించిన రూ.లక్షతో ఈ సహాయం అందజేశామని వివరించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

పాల్వంచరూరల్: పురిటినొప్పులతో ఉన్న మహిళను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా 108 వాహనంలో మంగళవారం ఓ మహిళ ప్రసవించింది. వివరాలు... దంతలబోరు పంచాయతీ సీతారాంపురం గ్రామానికి చెందిన మడకం హురే ప్రసవం కోసం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మధ్యలో పురిటినొప్పులు రావడంతో ఈఎంటీ ఉషాదేవి పురుడుపోసింది. మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను ఆస్పత్రిలో చేర్చి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు.

ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని, ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 27న చీఫ్ మెడికల్ ఆఫీసర్ సింగరేణి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ అత్యవసర సేవలకై ఇతర సెంటర్లకు పంపడానికి అంబులెన్స్ ఉపయోగించరాదని, ఒకవేళ ఉపయోగిస్తే సీపీఆర్ఎంఎస్ నుంచి అంబులెన్స్ చార్జీలు రికవరీ చేయబడతాయని సర్క్యులర్ జారీ చేయటం దారుణమన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి కోసం శ్రమించి, సంస్థ అభివృద్ధిలో తనవంతు కృషి చేసిన కార్మికుడికి కనీసం ఉన్నత శ్రేణి వైద్యం కోసం వెళ్లేందుకు ఉచిత అంబులెన్స్ ఇవ్వలేని దుస్థితిలో సింగరేణి ఉందా అని ప్రశ్నించారు. వెంటనే ఆ సర్క్యులర్‌ను రద్దు చేయాలని, సీపీఆర్ఎంఎస్ కార్డ్ హోల్డర్‌కు అంబులెన్స్ సౌకర్యం కల్పించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జీ.వీరస్వామి, మోటపలుకుల రమేష్, కే.రాములు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలపై వడ్డీ దందా

పొదుపు సంఘాలే లక్ష్యంగా ప్రైవేటు బ్యాంకులు, వడ్డీ వ్యాపారులు రుణ దందాను సాగిస్తున్నారు. అవసరాలు అత్యవసరంగా తీరుతున్నాయన్న ఆలోచనతో వారి ఉచ్చులో ఇరుక్కుపోతున్నారు. చివరకు వారికి వడ్డీలు చెల్లించేందుకు అప్పుల భారం పెంచుకుంటున్నారు. సెర్ప్ ద్వారా మంజూరయ్యే రుణాలను ప్రైవేటు రుణాల చెల్లింపుకు వినియోగిస్తూ మొండి బకాయిదారులుగా మిగిలిపోతున్నారు. చివరకు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే రాయితీ సౌకర్యాలకు కూడా దూరమవుతున్నారు.

- విస్తరిస్తున్న ప్రైవేటు బ్యాంకులు
- అదే బాటలో మైక్రో రుణ సంస్థలు
- అధిక వడ్డీలతో నష్టపోతున్న మహిళలు
- సెర్ప్‌లో భారీగా పేరుకుపోతున్న బకాయిలు


21పిట్ ఏరియాలో మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సెర్ప్ సిబ్బంది

ఇల్లెందురూరల్: మండల వ్యాప్తంగా సెర్ప్‌లో 1,144 పొదుపు సంఘాల గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో పది మంది వరకు సభ్యులు ఉంటారు. ఇందులో ప్రస్తుతం 1,021 సంఘాలకు రుణాలు అందిస్తున్నారు. వీరంతా సెర్ప్ ద్వారా ప్రధానంగా తక్కువ వడ్డీతో అత్యధిక కాలపరిమితితో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల రూపంలో రుణాలు పొందుతుంటారు. నిర్దేశిత గడువులో రుణాలు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీలేని రుణాలు కూడా మంజూరు చేస్తుంది.

పొదుపు సంఘాల సభ్యులే లక్ష్యం..

ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న ప్రైవేటు బ్యాంకులు ఇతర పొదుపు సంఘాలలో సభ్యులుగా లేని మహిళలతో కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు రుణాలు మంజూరు చేసుకోవాల్సి ఉంటుంది.

కానీ ఇందుకు విరుద్ధంగా ఇల్లెందు కేంద్రంగా కొనసాగుతున్న ప్రైవేటు బ్యాంకు ఉన్న పొదుపు సంఘాల సభ్యులనే లక్ష్యంగా చేసుకొని రుణాలు ఇస్తున్నారు. ఒక్కో మహిళకు రూ.40వేలు రుణంగా చెల్లించి అందులో ఇన్సూరెన్స్, ఖాతా పుస్తకం పేరుతో రూ.వెయ్యి కోత విధించి రూ.39వేలు చెల్లిస్తున్నారు. ఈ సొమ్మును తిరిగి వారానికి రూ.వెయ్యి చొప్పున 48 నెలలపాటు క్రమం తప్పకుండా చెల్లించాల్సి ఉంటుంది. అంటే సుమారుగా ఏడాది వ్యవధిలో రూ.40వేలకు రూ.9వేల వరకు వడ్డీని మహిళలు చెల్లించక తప్పడం లేదు. వాయిదాల ప్రకారం రుణాలు చెల్లించని వారికి వడ్డీల భారం తడిసి మోపెడవుతోంది.

సెర్ప్‌లో వడ్డీ వివరాలు..

సెర్ప్ ద్వారా పొదుపు సంఘాలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల రూపంలో రుణాలు మంజూరు చేస్తుంటారు. ప్రైవేటు బ్యాంకుల మాదిరిగా స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.40వేలు రుణం తీసుకుంటే ఏడాది వ్యవధిలో రుణం తీర్చాల్సి వస్తే 11శాతం వడ్డీరేటులో అసలుతోపాటు చెల్లించాల్సిన వడ్డీ రూ.43,040 ఉంటుంది. బ్యాంకు లింకేజీ విషయంలో కూడా ఇదే తరహాలో రుణాలు మంజూరు చేస్తుంటారు.

దూరమవుతున్న రాయితీ...

సెర్ప్ ద్వారా రుణాలు పొందే మహిళలకు అనేక రాయితీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. రుణాలు పొందిన మహిళలు దురదృష్టవశాత్తు మృతి చెందితే రుణం రద్దు చేయడంతోపాటు అప్పటి వరకు చెల్లించిన చెల్లింపులను తిరిగి మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేస్తారు. ఇలా మృతి చెందిన, ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబాలకు రాయితీలు అందుబాటులో ఉన్నాయి. ఇంతేకాకుండా క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించిన పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ మాఫీ పథకం కూడా అందుబాటులో ఉంది. వీటితోపాటు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పింఛన్ బీమా యోజన పథకాలు పొదుపు సంఘాల మహిళల కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నాయి. ప్రైవేటు బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్‌ల ద్వారా రుణాలు పొందే మహిళలు ఇలాంటి రాయితీలు ఏవీ వర్తించవు.

సెర్ప్‌లో పేరుకుపోతున్న బకాయిలు...

తక్కువ వ్యవధిలో అడిగినంత అప్పులు ఇస్తుండటంతో పొదుపు సంఘాల మహిళలు ప్రైవేటు బ్యాంకులను ఆశ్రయించి అప్పు తీసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీవారం వాయిదా చెల్లించాల్సి ఉండటంతో సెర్ప్ ద్వారా తీసుకున్న రుణాలను ప్రైవేటు బ్యాంకులో వాయిదాల చెల్లింపుకు వినియోగిస్తున్నారు. చివరకు డబ్బులు చేతిలో లేక సెర్ప్‌లో వాయిదాల చెల్లింపును అటకెక్కిస్తున్నారు. ఈ కారణంగా సెర్ప్‌లో గడిచిన మూడేళ్లుగా గతంలో ఎన్నడూ లేనంతగా బకాయిలు పేరుకుపోయాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాలు రూ.1.27 కోట్లు, బ్యాంకు లింకేజీ రూ.1.14 కోట్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. రికవరీ కోసం పొదుపు సంఘం సభ్యుల ఇళ్ల చుట్టూ సెర్ప్ ఉద్యోగులు అందరూ తిరిగినా ఫలితం ఉండటం లేదు.

కౌన్సెలింగ్‌తో మార్పునకు యత్నం...

బకాయిలు పేరుకుపోతుండటం, ఉన్నతాధికారుల నుంచి అక్షింతలు అధికమవడంతో సెర్ప్ ఉద్యోగులు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. ప్రైవేటు బ్యాంకు విరుగుడు కోసం మొండి బాకాయిదారులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. దీనికోసం తొలి ప్రయత్నంగా మండలంలోని 21పిట్ ఏరియాలో సోమవారం పలువురు మహిళలకు సెర్ప్ సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

అవగాహన కల్పిస్తున్నాం...



ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా తమ పరిధిలోని పొదుపు సంఘాలకు ప్రైవేటు బ్యాంకులు, ప్రైవేటుగా అప్పులు ఇస్తున్నాయి. కొంతమంది మహిళలు వారి పట్ల ఆకర్షితులై చివరకు వడ్డీలు చెల్లించలేక అప్పులపాలవుతున్నారు. ఈ కారణంగా సెర్ప్‌లో కూడా రుణ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఈపరిస్థితిపై మహిళలకు కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించి మార్పు కోసం ప్రయత్నిస్తున్నాం.

– కామిశెట్టి దుర్గారావు, ఏపీఎం, సెర్ప్, ఇల్లెందు

ప్రతిష్ఠ పూజలకు హాజరైన ఎంపీ


పూజ చేస్తున్న ఎంపీ వద్దిరాజు

జూలూరుపాడు: అనంతారం గ్రామంలో కొనసాగుతున్న శ్రీ అభయహస్త వీరాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ పూజలకు మంగళవారం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మేళతాళాలతో బాణసంచా కాలుస్తూ ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాపట్ల మురళీ, బండారు వెంకయ్య, బంటు వెంకటేశ్వర్లు, బండారు నరసింహారావు, ఉసికల రమేష్, బండారు పుల్లారావు, ఉసికల వెంకటేశ్వర్లు, బండారు నరేష్, శివ, పోగుల నరసింహారావు, సాంబారు నరేష్, బండారు అప్పారావు, తిరుమలరావు, ఉసికల శ్రీను, నరసింహారావు, మల్లెల నాగేశ్వరరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, శీరంశెట్టి రామారావు, పెంటికల వీరబాబు, చిన్నంశెట్టి రంగారావు పాల్గొన్నారు.

చెట్టు కిందే అంగన్‌వాడీ సేవలు

సుజాతనగర్: శిశు సంక్షేమాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా కొన్నిచోట్ల ఆ దిశగా సేవలు అందడం లేదు. మండలంలోని గొల్లగూడెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని చెట్టు కిందనే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కేంద్రం పరిధిలో మూడు నుంచి ఆరేళ్ల వయసు గల పిల్లలు 10 మంది, టీహెచ్‌ఆర్ పిల్లలు 22 మంది, గర్భిణులు ఇద్దరు, బాలింతలు నలుగురు ఉన్నారు. గతంలో సుమారు పదేళ్లపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని టీచర్ ఇంట్లోనే నిర్వహించారు. మూడేళ్ల నుంచి అద్దెభవనంలో కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే గ్రామంలో కేంద్రం నిర్వహణకు గది కావాల్సి ఉండగా... ఎవరూ అద్దెకు ఇవ్వకపోవడంతో ఇలా చెట్టు కిందనే అంగన్‌వాడీ సేవలు అందించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ చెట్టు సమీపంలో ఓ పాత ఇల్లు ఉండటంతో ఆ ఇంట్లోని గదిలో అంగన్‌వాడీ సరుకుల నిల్వ చేసి చిన్నారులు, గర్భిణులు, బాలింతలను కూర్చోబెట్టడం, బరువు చూడడం వంటి పనులను చెట్టు కిందనే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చెట్టు కింద చిన్నారి బరువు చూస్తున్న టీచర్

సోలార్ పంపునకు మరమ్మతులు

పాల్వంచరూరల్: ఎట్టకేలకు సోలార్‌పంపుకు మరమ్మతులు చేశారు. ఉల్వనూరు గ్రామపంచాయతీ గంగాదేవిపల్లి గ్రామంలో రెండునెలలుగా సోలార్ పంపు మరమ్మతులకు గురికావడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

ఈ క్రమంలో సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి అధికారులు స్పందించి ఎట్టకేలకు మంగళవారం సోలార్ పంపుకు మరమ్మతులు నిర్వహించి ప్రత్యేక మోటారును బిగించి ప్రజలకు తాగునీటిని అందించినట్లు ఎంపీఓ నారాయణ తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వాసం రుద్ర, స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు నిర్వహించనున్న ఉచిత మోడల్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెంలోని నవత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కె.రాజేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4, 5, 6, 7 తేదీలలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని నవత బుక్ స్టాల్, ఫోన్ నెంబర్ 9396401400 నంబురులో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోండి..


పాల్వంచరూరల్: జగన్నాథపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు



సుజాతనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న రాంబాబు

పాల్వంచరూరల్: ప్రతీఒక్కరు ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి కోరారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామ సంఘాల సభ్యులతో మంగళవారం మండలంలోని జగన్నాథపురం, పాండురంగాపురం, బస్వతారక కాలనీలో ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. అనంతరం నిష్పక్షపాతంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నాయుడు రాంబాబు, ఏపీఓ పొరండ్ల రంగా, పంచాయతీల కార్యదర్శులు సాయిరాం, రాంబాబు, ప్రభాకర్, వీఓఏలు, గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సుజాతనగర్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా కీలకమైందని ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి అన్నారు. ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పౌరుడు ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. దేశభవిష్యత్‌ను నిర్ణయించే శక్తి ఓటుకే ఉందన్నారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రామ పంచాయతీల్లో 5కే రన్, ర్యాలీలు, వ్యాసరచన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎం వెంకయ్య, పంచాయతీ సెక్రటరీ బి.నరేందర్, ఏపీఎం మీరాంబి, గ్రామ దీపికలు మాధవి, విజయనిర్మల, అరుణ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఓటు హక్కు ఉన్న ప్రతీఒక్కరు ఆ హక్కును సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ సీసీ చిట్టిమల్ల రాంబాబు, మొండితోగు పంచాయతీ కార్యదర్శి మోజెస్ సూచించారు. మండలంలోని మొండితోగు గ్రామపంచాయతీలో మంగళవారం అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటు హక్కు రాజ్యాంగం ప్రతీ పౌరుడికి కల్పించిన హక్కుగా గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మన ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఆ హక్కు ద్వారా ప్రజలకు కలుగుతుందని చెప్పారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తా..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచరూరల్: ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పని చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని సారెకల్లు, కారెగట్టు, పుల్లాయిగూడెం, పునుకుల, దేవిజాతండా, వీరునాయక్‌తండా, బిక్కుతండా, నాగారం కాలనీ, కోడిపుంజుల వాగు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పది సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గంలో అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు తదితర పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, సీపీఐ మండల కార్యదర్శి విసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, జకరయ్య, పాషా, సురేష్, నాగేశ్వరరావు, విజయ్, రాజశేఖర్, సత్యనారాయణ, కొండం వెంకన్న పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులు ఇవ్వండి


జీఎం శాలేంరాజును సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాపిత 11 ఏరియాల్లో ఏ ఏరియా సాధించని అత్యధిక బొగ్గు ఉత్పత్తికి రేయింబవళ్లు కృషి చేసిన కొత్తగూడెం ఏరియా కార్మికులకు సింగరేణి యాజమాన్యం బహుమతులు, మెమెంటోలు అందజేయాలని కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజును కోరారు. ఈ మేరకు జీఎం ఎంశాలేంరాజును కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజ్ మాట్లాడుతూ... సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆల్‌టైమ్ రికార్డ్‌గా 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించడంలో కొత్తగూడెం ఏరియా కీలక పాత్ర వహించి 138.50 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచేందుకు జీఎం ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. ఉత్పత్తిలోనే కాకుండా రవాణాలో కూడా 3,114 రేకులు రవాణా చేసి గతంలో ఉన్న రికార్డ్‌ను అధికమించినట్లు తెలిపారు. అనంతరం జీఎంను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆల్బర్ట్, కాలం నాగభూషణం, జే.రాజేశ్వరరావు, చెన్న కేశవరావు, గోపు కుమారస్వామి, చిలక రాజయ్య, ఎం.రామారావు, చిలక రాజయ్య, సత్తార్‌పాష, నటరాజ్, బాలాజీ, సకినాల సమ్మయ్య, కొమరయ్య పాల్గొన్నారు.

కార్మికులకు స్వీట్ ప్యాకెట్లు పంపిణీ

టేకులపల్లి: 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నూరు శాతం సాధించిందని, ఇందుకు కారకులైన కార్మికులు అభినందనీయులని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. కేటీసీ వద్ద మంగళవారం కార్మికులకు ఆయన స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా ప్రథమ స్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు మల్లయ్య, గిరిధర్‌రావు, మోహన్‌రావు, శ్రీనివాస్, సుమన్, శివశంకర్, రాజు, కృష్ణ, నజీర్ అహ్మద్, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్ఆర్ డీజీ’లో గ్రాడ్యుయేషన్ డే


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: రాంనగర్‌లోని ఎస్ఆర్ డీజీ పాఠశాలలో మంగళవారం ఘనంగా యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఎస్ఆర్ సంస్థల డీజీఎం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ... విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయటంలో ఎస్ఆర్ ఎప్పుడూ ముందుంటుందని, క్రమశిక్షణకు మారుపేరుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. జోనల్ ఇన్‌చార్జ్ వై.సతీష్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను అందేలా చూస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో భాగమవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రామాయణంలోని కొన్ని ఘట్టాలను తీసుకొని చేసిన నృత్యాలు, నీటిని వృథా చేయకుండా సంరక్షించే సందేశాత్మక నృత్యాలు, మహిళలను కాపాడుకుందాం.. మహిళా సాధికారతకు సంబంధించిన సందేశాత్మక నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

చుంచుపల్లి: గాంధీనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి బీజేపీ జిల్లా నాయకుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... బడుగు, బలహీనవర్గాలను ఏకం చేసి, సామాజిక న్యాయంతో అన్నివర్గాలను కలుపుకుని పోయిన సర్దార్ సర్వాయి పాపన్న సేవలు అభినందనీయమన్నారు. నరేంద్రబాబు, పైడిపాటి రవీందర్, వీరగోని రమణ గౌడ్, మోహన్‌రావు గౌడ్, నర్సింహారావు, బండారు కోటేశ్వరరావు, ఉబ్బనపల్లి శ్రీనివాస్, వినీల్‌కుమార్, ఖాసిం, కాజామియా, శివ, తరుణి, మణి పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో సింగరేణి ముందంజ

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే సింగరేణిలో మార్పుకు శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ నాయకులు ఆకునూరి కనకరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల వేతనాల చెల్లింపు సమయంలో అప్పుల కోసం సింగరేణి అధికారులు బ్యాంకుల చుట్టూ తిరిగేవారని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏ బ్యాంకు వడ్డీ ఎక్కువ చెల్లిస్తుందో వారికి సింగరేణి అప్పు ఇచ్చేలా బిడ్లను ఆహ్వానించే స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వం, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌తో మూలంగానే సాధ్యమవటమే కాకుండా ఆరేళ్లలో ఉత్పత్తిలో వెనకపడిన సింగరేణి 2023-24 లో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తిని ప్రణాళిక ద్వారా సాధించటం సాధ్య మయిందని తెలిపారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: వేసవిలో వడదెబ్బ, డీహైడ్రేషన్‌కు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాలలో విస్తతంగా ప్రచారం చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు వడదెబ్బకు గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామాలలో అవకాశం ఉన్న ప్రతీ సందర్భంలో వేసవి జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపర్చాలన్నారు. ఉపాధి హామీ పనులు చేసే కూలీలు ఎండ వేడిమి తీవ్రం కాకముందే ఇళ్లకు చేరుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత, ఎంపీవో చిరంజీవి పాల్గొన్నారు.

రొంపేడు పీహెచ్‌సీలో...

ప్రస్తుతం మండుతున్న ఎండల కారణంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ సమయంలో ప్రజలు వబదెబ్బకు గురికాకుండా వైద్య సిబ్బంది చైతన్యం కలిగించాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత సూచించారు. రొంపేడు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా ఆపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలని వివరించారు. ఈ సమయంలో ప్రజలు నీరు, పళ్లరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని, భోజనం మితంగా, నీటిని అధికంగా తీసుకోవాలని చెప్పారు. వేసవిలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, తలకు రుమాలు వంటిని ధరించాలని, అత్యవసమైతే తప్ప పగటిపూట ఇళ్ల నుంచి బయటకు రావొద్దని చెప్పారు. గ్రామాలలో ప్రతీ కుటుంబానికి ఆయా జాగ్రత్తలు సూచించి చైతన్యం కలిగించాలని వివరించారు. సమావేశంలో భద్రు, రాజు, అమరావతి, సత్యం పాల్గొన్నారు.


రొంపేడులో మాట్లాడుతున్న డాక్టర్ కవిత